సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 26 | మార్చి | 2025





సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి
రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడి సాధించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^0 / 23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.

తగ్గుతున్న పీడీ కేసులు
వరంగల్ కమిషనరేట్‌లో ఈ ఏడాది సున్నా



- గతేడాది రెండు కేసులు మాత్రమే నమోదు
- కమిషనరేట్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 254 మందిపై పీడీయాక్ట్
- యాక్టు నమోదులో కోర్టు ఇబ్బందులు

వరంగల్ క్రైం: తీవ్రమైన నేరాలకు పదేపదే పాల్పడే అక్రమార్కులు, నేరస్తులపై పీడీ యాక్టులతో పోలీసులు ఉక్కుపాదం మోపుతారు. ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు ఇబ్బందిగా పరిణమించే వారిపట్ల ఇదో చట్టపరమైన ఆయుధం. కానీ, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెండేళ్లుగా పీడీయాక్టుల కేసు నమోదు అంతంతమాత్రమే. గత ఏడాది కేవలం రెండు కేసులు నమోదు చేయగా, ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్కకేసు కూడా పెట్టలేదు. కానీ, అక్రమార్కుల ఆగడాలు, కబ్జాదారులు, గంజాయి, డ్రగ్స్ సరఫరాకు అడ్డుకట్ట పడిందంటే లేదనే చెప్పాలి. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సుధీర్‌బాబు, రవీంద్రకుమార్, తరుణ్‌జోషి హయాంలో ఎక్కువగా పీడీ యాక్టులు నమోదు చేశారు. ఏవీ రంగనాథ్ పనిచేసిన సమయంలో అక్రమార్కులు, భూకబ్జాదారులపై ఉక్కపాదం మోపారు. పేదల భూముల్లో అడుగు పెట్టాలంటే ఒంట్లో వణుకు పుట్టించారు. ఆ తర్వాత వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలు, ఉదాసీనతతో అక్రమార్కులు పనులు యథాతథమయ్యాయి. మళ్లీ భూకబ్జాలు అక్కడక్కడా వెలుగు చూస్తూనే ఉన్నాయి. రోజుకు ఎక్కడో ఒకచోట గంజాయి లభిస్తూనే ఉంది. దొంగలు పగలు, రాత్రి తేడా లేకుండా చోరీల మీద చోరీలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

కోర్టు ఇబ్బందులతో వెనుకడుగు..
వివిధ రకాల నేరాలకు పాల్పడే అంతర్రాష్ట్ర నేరస్తులపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తున్న క్రమంలో పోలీసు అధికారులకు కోర్టుల్లో చేదు అనుభవం ఎదురవుతుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్ద నేరాలు ఒక్కటి చేసినప్పటికి వారిపై పీడీయాక్టు నమోదు చేసే నిబంధనలు అడ్డొస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నిందితులకు పీడీయాక్టు నివేదికలను వారి సొంత భాషలో ఇవ్వడంలో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. దీని వల్ల పీడీయాక్టు కేసులు నమోదైనప్పటికీ అన్ని కేసులు చివరి వరకు నిలవడం లేదు.

ఏడాది జైలుపాలే..


- తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపట్ల పోలీస్ అధికారులు కేసుల తీవ్రతను బట్టి పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తారు.
- సంచలనం కలిగించే హత్య కేసులు ఒక్కటి, మూడు నెలల్లో రెండు కేసులు, 20 కిలోల గంజాయి, డ్రగ్స్ వంటి కేసుల్లోని నిందితులపై పీడీయాక్టు నమోదు చేశారు.
- ఈ కేసులో సంవత్సరం వరకు బెయిల్ మంజూరు కాదు.
- నిందితులను జైల్లోనే ఉంచి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని, వారివల్ల ప్రజలు ఇబ్బందులకు గురి కావొద్దు అనే ఆలోచనలతో పీడీయాక్టు నమోదు చేస్తారు.
- పోలీస్ కమిషనరేట్‌లో ఇప్పటివరకు మొత్తం 254 మందిపై పీడీయాక్టు పెట్టారు.



హద్దుమీరితే పీడీ యాక్టు నమోదు


హద్దుమీరి నేరాలకు పాల్పడే వారిపై కచ్చితంగా పీడీ యాక్టు నమోదు చేస్తాం. ఈ కేసులతో నేరస్తుల్లో భయంతోపాటు వారి ప్రవర్తనలో మార్పు వస్తుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిదిలో నేరాలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. భూకబ్జాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతాం.

\- సన్‌ప్రీత్‌సింగ్, వరంగల్ సీపీ

న్యూస్‌రీల్

మే1 నుంచి ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు
వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారులు వచ్చే నెల 15 వరకు హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెల రోజులపాటు శిబిరాలను నిర్వహించే శిక్షకులకు గౌరవ వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కొనసాగే శిక్షణ శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లోని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రెండు రోజులపాటు జాతీయ కాన్ఫరెన్స్
విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ పి.అరుణ, కోకన్వీనర్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్ సైన్స్ ఫర్ సస్టయినబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్' అంశంపై ఈ జాతీయ కాన్ఫరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పి.ప్రావీణ్య, నిట్ ఫిజిక్స్ ప్రొఫెసర్ హరినాథ్ కీలక ఉపన్యాసం చేస్తారని, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్, సీసీఈటీ ఏజీఓ ప్రొఫెసర్ బాల భాస్కర్ పాల్గొంటారని వివరించారు.

ఐఎస్ఎఫ్‌తో నిట్ ఒప్పందం


కాజీపేట అర్బన్: ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) కర్నాటకతో నిట్ వరంగల్ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. నిట్ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ బిద్యాధర్ బిద్యాధర్ సుబుధీ, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేపీ చౌదరి పరస్పర ఒప్పందపత్రాలను అందజేసుకున్నారు. కాగా, స్టార్టప్‌ల అభివృద్ధికి ఎంఓయూ తోడ్పడుతుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు.

పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు ఏప్రిల్ 2
కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకులాలకు సంబంధించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల 2,4, 6 సెమిస్టర్ పరీక్షల ఫీజులు చెల్లించేందుకు అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 2వరకు గడువు పొడిగించారు. రూ.50 అపరాధ రుసుముతో ఏప్రిల్ 9 వరకు ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, వెంకటయ్య తెలిపారు. ఏప్రిల్, మేలో పరీక్షలు నిర్వహించనున్నారని, వివిధ కోర్సుల ఫీజుల వివరాలు, పూర్తి సమాచారం కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని వారు పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించండి..!
లేకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని హౌసింగ్ బోర్డు నోటీసులు

- ఈ నెల 31లోపు చెల్లించాలని అల్టిమేటం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.22,49,76,301 బకాయిలు
- వడ్డీకి వడ్డీ వేశారంటున్న లబ్ధిదారులు

హనుమకొండ వడ్డేపల్లిలోని హౌసింగ్ బోర్డు కాలనీ



హన్మకొండ:

పెండింగ్ బకాయిలను రాబట్టుకునేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కఠిన చర్యలకు పూనుకుంది. ఈ నెల 31లోపు బకాయిలు చెల్లించకపోతే ఇళ్లు ఖాళీ చేయాల్సి ఉంటుందని అల్టిమేటం ఇచ్చింది. ఈ మేరకు హౌసింగ్ బోర్డు నోటీసులు జారీ చేసింది. హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ పరిధిలోని పూర్వ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ హౌసింగ్ బోర్డు పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. వాయిదాల మేరకు సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉండగా కొంతమంది నిర్లక్ష్యం చేశారు. బకాయిలు తడిసి మోపెడు కావడంతో హౌసింగ్ బోర్డు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేయడంతో లబ్ధిదారులు మొత్తుకుంటున్నారు. అసలుకు వడ్డీలపై వడ్డీలు వేసి అధిక మొత్తం చెల్లించాలని నోటీసులు జారీ చేశారని లబోదిబోమంటున్నారు.

వరంగల్ డివిజన్ పరిధిలో 528 మందికి నోటీసులు..

తెలంగాణ హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ పరిధిలోని హనుమకొండ వడ్డేపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, వరంగల్ గొర్రెకుంట కాలనీ, జగిత్యాల, మంచిర్యాల నస్పూర్ కాలనీ, మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ కాలనీ, కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ, జమ్మికుంటలోని హౌసింగ్ బోర్డు కాలనీ, జనగామలోని హౌసింగ్ బోర్డు కాలనీ, కొత్తగూడెం చుంచుకాలనీకు చెందిన బకాయిలు మొత్తం రూ.44,69,99,904 పేరుకుపోయాయని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 528 మందికి నోటీసులు జారీ చేశారు.

ఒక్కో కాలనీలో రూ.3లక్షల నుంచి రూ.18 లక్షలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.22,49,76,301 బకాయిలు పేరుకుపోయినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు బకాయిలు చెల్లించేందుకు గడువు విధించారు. గడువులోగా బకాయిలు చెల్లించకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఒక్కో కాలనీలో బకాయిదారులు రూ.3 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు బకాయిలున్నారు. బకాయిలు సంస్థకు గుదిబండగా తయారయ్యాయి. ఈ క్రమంలో రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి బకాయిలు వసూలు చేయాల్సిందేనని సీరియస్‌గా చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు హుటాహుటినా నోటీసులు జారీ చేశారు.

జిల్లాల వారీగా ఇలా..
- హనుమకొండ వడ్డేపల్లిలో అపార్ట్‌మెంట్ మోడల్‌లో 744 ఫ్లాట్లు నిర్మించారు. వీటిని 1990లో లబ్ధిదారులకు కేటాయించగా చాలా మంది క్రయవిక్రయాలు జరిపారు. ఇక్కడ రూ.3,67,81,668 బకాయిలు పేరుకుపోగా ఇప్పుడు 142 మందికి నోటీసులు జారీ చేశారు.
- వరంగల్ గొర్రెకుంట కాలనీలో 1376 ఇళ్లు నిర్మించారు. వీటిని దశల వారీగా 1992, 1993, 2003, 2012లో లబ్ధిదారులకు కేటాయించారు. ఈ కాలనీలో రూ.9,43,58,063 బకాయిలు పేరుకుపోగా వీటిని రాబట్టుకునేందుకు 103 మందికి నోటీసులు జారీ చేశారు.
- మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 79 ఇళ్లు నిర్మించి 1997లో లబ్ధిదారులకు కేటాయించారు. ఇక్కడ రూ.7,19,45,743 బకాయిలు ఉండగా, వీటిని రాబట్టుకునేందుకు 64 మందికి నోటీసులు జారీ చేశారు.
- జనగామ హౌసింగ్ బోర్డు కాలనీలో 127 ఇళ్లు నిర్మించగా రూ.2,18,90,827 బకాయిలు పేరుకుపోయాయి. వీటిని రాబట్టుకునేందుకు 17 మందికి నోటీసులు జారీ చేశారు.

నోటీసులు జారీ చేశాం...
పేరుకుపోయిన బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు బకాయిదారులకు నోటీసులు జారీ చేశాం. ఈ నెల 31వ తేదీలోపు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- అంకం రావు, హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ ఈఈ

తరాలపల్లి నుంచి దండకారణ్యం వరకు..
ముగిసిన అంకేశ్వరపు సారయ్య ఉద్యమ ప్రస్థానం

ముగిసిన 35 ఏళ్ల ప్రస్థానం..
సుమారు 35 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో తన ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించిన సారయ్య మంగళవారం ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. హనుమకొండ, ఖమ్మం జిల్లాల్లో వివిధ స్థాయిల్లో పనిచేసి 1995లో దండకారణ్యానికి వెళ్లిన ఆయన దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. ప్రస్తుతం ఈస్ట్ బస్తర్ డీకేఎస్‌జడ్‌సీ సభ్యుడిగా, మాస్ మొబైల్ అకడమిక్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది.



- 35 ఏళ్ల అజ్ఞాతవాసం... దళసభ్యుడి నుంచి డీకేఎస్‌జడ్‌సీ వరకు
- దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన సుధీర్
- విషాదంలో తరాలపల్లి.. నేడు గ్రామానికి మృతదేహం



తరాలపల్లిలోని సారయ్య ఇల్లు

సాక్షిప్రతినిధి, వరంగల్/కాజీపేట అర్బన్ :

అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్, ఎల్లన్న, సుధాకర్.. హనుమకొండ జిల్లా తరాలపల్లి ముద్దుబిడ్డ.. రెండు పదుల వయస్సులో ఆయిడిసి, బాయిడిసి అడవిబాట పట్టిన మావోయిస్టు నేత. దళసభ్యుడి నుంచి దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడి వరకు ఎదిగిన సారయ్య అలియాస్ సుధీర్ 35 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. దంతెవాడ జిల్లా బీజాపూర్ ప్రాంతంలోని గీడం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిర్సాపర, నెల్గోడ, బోడ్గా, ఇకెలి గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఎస్పీ గౌరవ్‌రాయ్ మంగళవారం ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ముగ్గురు మృతిచెందగా.. మృతుల్లో సారయ్య ఉన్నట్లు వెల్లడించారు. బీజాపూర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సారయ్య మృతి చెందాడన్న వార్తతో తరాలపల్లిలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు..

తరాలపల్లి గ్రామానికి చెందిన సారయ్య కొండపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. 1982లో 10వ తరగతి చదువుతున్న తరుణంలోనే నాడు మావోయిస్టులు ఇచ్చిన 'గ్రామాలకు తరలండి' పిలుపునకు ఆకర్షితుడై, తరాలపల్లి విలేజ్ ఆర్గనైజర్ బండి ఆశాలు, హనుమకొండ సిటీ ఆర్గనైజర్ తిప్పారపు రాములు అలియాస్ తాత సారథ్యంలో తరాలపల్లి గ్రామ అధ్యక్షుడిగా తన ప్రస్థానం ప్రారంభించాడు. అంచలంచెలుగా మావోయిస్టు పార్టీలో ఎదుగుతున్న తరుణంలో 1990లో బీఎస్ఎఫ్ సిబ్బంది గ్రామాల్లో రావడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 1993లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిటీ ఆర్గనైజర్ తాత చనిపోవడంతో.. అజ్ఞాతంలోకి వెళ్లిన సారయ్య నేటి వరకు గ్రామానికి తిరిగి రాలేదు.



ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన సారయ్య

అమరుల పల్లె తరాలపల్లి..
తరాలపల్లి ఉద్యమాలకు కేరాఫ్. ఎందరో ఈ గ్రామం నుంచి విప్లవోద్యమాల వైపు ఆకర్షితులై ఎన్‌కౌంటర్లలో అసువులు బాశారు. 1991లో వేల్పుల జగదీశ్ అలియాస్ ఉప్పలన్న, 1992లో బండి ఆశాలు అలియాస్ శ్రీను పగిడేరు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. 1998 నుంచి గాజుల శ్రీకాంత్ అలియాస్ శ్రీనాథ్, ముప్పిడి నాగేశ్వర్‌రావు అలియాస్ విశ్వనాథ్, చిరబోయిన సదానందం, సంపత్, కొత్తపల్లి సాంబయ్య మృతిచెందగా.. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అంకేశ్వరపు సారయ్య చనిపోవడం చర్చనీయాంశంగా మారింది. సారయ్య మృతదేహం బుధవారం తరాలపల్లికి రానుంది.

కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
వరంగల్ కలెక్టర్ సత్య శారద



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వరంగల్: వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. వరంగల్‌లోని పాత ఆజంజాహి మిల్స్ గ్రౌండ్స్‌లో 16.7 ఎకరాల విస్తీర్ణంలో రూ.80 కోట్ల వ్యయంతో చేపట్టిన కలెక్టరేట్ నిర్మాణ పనుల పురోగతిని బ్లూ ప్రింట్ మ్యాప్ ప్రకారం మంగళవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 60 శాతం పనులు పూర్తయ్యాయని, ఫినిషింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ 2025 సెప్టెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి రమేశ్, డీఈ శ్రీధర్, కలెక్టరేట్ ఏఓ విశ్వప్రసాద్, ఏఈ శ్రీకాంత్, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష..

మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, గ్రీన్ ఫీల్డ్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన పనులపై కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ ఏనుమాముల, గీసుకొండ, ఖిలావరంగల్ ఇన్నర్‌రింగ్ రోడ్డు పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు డబ్బులు చెల్లించుటకు సిద్ధంగా ఉన్నాయని, ఆ పనులు పూర్తి చేసే ప్రక్రియలో వేగం పెంచాలని ఆర్డీఓను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పనుల్లో భాగంగా ఖిలావరంగల్‌లోని నక్కలపల్లి, గాడిపల్లిలో సర్వే పూర్తయిందని పనులు పురోగతికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు నాగేశ్వరరావు, ఇక్బాల్, రాజ్‌కుమార్, రియాజుద్దీన్, వెంకట్‌స్వామి పాల్గొన్నారు.

ఔషధ గిడ్డంగిని తనిఖీ చేసిన కలెక్టర్..

ఖిలా వరంగల్: రంగశాయిపేటలోని కేంద్ర ఔషధ గోదాంను కలెక్టర్ సత్యశారద తనిఖీ చేశారు. అనధికారికంగా విధులకు గైర్హాజరైన సూపర్‌వైజర్ నాగమణి, ప్యాకర్ చక్రపాణికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. సెలవు పెట్టకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బండి నాగేశ్వర్‌రావు, ఇక్బాల్ పాల్గొన్నారు.

భద్రకాళి శేషుకు 'ఆగమ ద్యుమణి' బిరుదు



శేషుకు ఆగమ ద్యుమణి బిరుదు ప్రదానం చేస్తున్న వీసీ కృష్ణమూర్తి, శాస్త్రవేత్త రాఘవేంద్ర

హన్మకొండ కల్చరల్: వరంగల్‌కు చెందిన ఆగమ సామ్రాట్, భద్రకాళి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, అర్చకుడు భద్రకాళి శేషు తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి ఆగమ ద్యుమణి బిరుదు అందుకున్నారు. విశ్వవిద్యాలయం వార్షికోత్సవాన్ని వైస్‌చాన్స్‌లర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షతన మంగళవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేశంలోని నిష్ణాతులైన పలువురు పండితులకు పురస్కారాలు అందించి సన్మానించారు. బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్త ఎల్ఎస్ రాఘవేంద్ర ముఖ్య అతిథిగా హాజరై భద్రకాళి శేషుకు ఆగమ ద్యుమణి బిరుదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శేషుకు భద్రకాళి దేవాలయ ఈఓ శేషుభారతి, సిబ్బంది, వరంగల్ సంగీత విద్వత్ గానసభ, అర్షధర్మరక్షణ సంస్థ సభ్యులు అభినందనలు తెలిపారు.

పీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘిస్తే చర్యలు
హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ (పీసీ అండ్ పీఎన్‌డీటీ) చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన పీసీఅండ్ పీఎన్‌డీటీ అథారిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు నిబంధనలను పాటించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రతి ఆస్పత్రిలో చట్టానికి సంబంధించిన బోర్డు అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. వైద్యాధికారులు రిజిస్టర్ అయిన కేంద్రాలతోపాటు రిజిస్టర్ కాని ఆస్పత్రులను కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పబ్లిక్ స్థలాల్లో వాల్‌పోస్టర్లు ప్రదర్శించడంతోపాటు స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులను కూడా అవగాహన సదస్సుల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించడమే కాక గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీఆర్‌డీఓ మేన శ్రీను, డీడబ్ల్యూఓ జయంతి, కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

రేపు 'నిధి ఆప్కే నికట్'

హన్మకొండ అర్బన్ : ఈపీఎఫ్ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదులు పరిష్కరించడానికి ఈనెల 27న (గురువారం) నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు వరంగల్ రీజియన్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ తానయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు సంబంధించి వరంగల్‌లోని వైభవ్ లక్ష్మి షాపింగ్ మాల్, హనుమకొండలోని గ్రీన్‌వుడ్ హైస్కూల్, తొర్రూరులోని సెయింట్ పాల్స్ హైస్కూల్, జనగామలోని శాన్ మారియా హైస్కూల్, భూపాలపల్లిలోని ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగులోని శ్రీ అరవింద ఉన్నత పాఠశాల, ఖమ్మంలోని మమత హాస్పిటల్ రోడ్డులో గల ఎస్‌బీఐటీ కళాశాల, ఇల్లందులోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదుల స్వీకరణతో పాటు పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పీఎఫ్ సభ్యులు, పెన్షనర్లు సద్వినియోగించుకోవాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

రూ.2.39లక్షల విలువైన సొత్తు అపహరణ

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లో తాళం వేసి ఊరెళ్లిన ఇంట్లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.2.39లక్షల విలువైన సొత్తు అపహరించారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. కరీమాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గంజి శ్యాం మోహన్, స్వర్ణలత దంపతులు ఈ నెల 17న ఇంటికి తాళంవేసి హైదరాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్‌నుంచి మంగళవారం మధ్యాహ్నం కరీమాబాద్‌లోని ఇంటికి చేరగా.. తాళం తీసి ఉండటంతో చోరీ చేసి ఉంటారని గ్రహించి వెంటనే ఆయన మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో దాచిన బంగారు గొలుసు 24గ్రాములు, మాటీలు నాలుగు గ్రాములు, ఉంగరం 3గ్రాములు, 5గ్రాముల బంగారు నాణెం.. మొత్తం 36 గ్రాముల బంగారం పాత విలువ ప్రకారం రూ.1 44 లక్షలు, వెండి పట్టీలు 150 గ్రాములు, రూ.80వేలు చోరీకి గురైనట్లు బాధితుడు శ్యాం మోహన్ ఫిర్యాదులో తెలిపారు. మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

పెట్రేగి పోతున్న గిరిగిరి వ్యాపారులు

● బాకీ ఇవ్వలేదని భౌతికదాడి

వరంగల్: వరంగల్‌లో గిరిగిరి వ్యాపారులు పెట్రేగి పోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం గిరిగిరిలో తీసుకున్న డబ్బుల్లో కొంత బకాయి ఇవ్వలేదనే కోపంతో తాజాగా బకాయిదారుడిపై భౌతిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. కాశిబుగ్గలోని ఓ ప్రైవేట్ వైద్యుడు ఓ గిరిగిరి వ్యాపారి వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకుని వాయిదాలు చెల్లించగా రూ.9వేలు బకాయి పడినట్లు సమాచారం. అప్పు ఇచ్చిన వ్యాపారి కుమారుడు పలుమార్లు వైద్యుడి వద్దకు వచ్చి బకాయిని ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అయినా సదరు వైద్యుడు స్పందించపోవడంతో వ్యాపారుడి కుమారుడు ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు వైద్యుడికి ఫోన్ చేసి అప్పు చెల్లించాలని సూచించగా నేను ఏసీపీ వద్దకు వస్తాను. అక్కడ తేల్చుకుంటానని చెప్పడంతో పోలీసులు మిన్నకుండి పోయి ఈవిషయం ఫిర్యాదు చేసిన వారికి తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన వ్యాపారి కుమారుడు తన మిత్రులతో కలిసి రెండు రోజుల క్రితం వైద్యుడిపై భౌతిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. అయితే అప్పు ఇవ్వకుంటే దాడికి పాల్పడం సరికాదని స్థానికులు అంటున్నారు. వైద్యుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.



'డిగ్రీ' ఉత్తీర్ణత అంతంతే..

సెమిస్టర్ సిస్టంలోనూ మెరుగైన ఫలితాలేవి!

● ఇటీవల ఫలితాలు ప్రకటించిన అధికారులు
● ఇందులో బాలికలదే హవా..
● రీవాల్యుయేషన్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు
● అటానమస్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీలో ఒకప్పుడు వార్షిక ఫలితాల విధానం ఉండేది. సంవత్సరం మొత్తం పాఠాలు చెప్పిన తర్వాత పరీక్షలు నిర్వహించే వారు. అనంతరం ఫలితాలు ప్రకటించేవారు. అయితే ఇందులో విద్యార్థులు తక్కువ ఉత్తీర్ణత సాధించేవారు. దీంతో ఈ విధానాన్ని రద్దు చేసి కొన్ని సంవత్సరాల క్రితం సెమిస్టర్ సిస్టం తీసుకొచ్చారు. అయినా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నారు. సెమిస్టర్ విధానంలో ఉదాహరణకు ఒక సబ్జెక్టుకు 100 మార్కులు ఉంటే అందులో 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. ఇక ప్రతీ సబ్జెక్టుకు 80 మార్కుల సెమిస్టర్ పరీక్ష ఉంటుంది. అందులో వచ్చిన మార్కులు, ఇంటర్నల్‌లో వచ్చిన మార్కులు కలిపే ఉత్తీర్ణత ప్రకటిస్తారు. అయినా ఈ విధానం వల్ల వివిధ సబ్జెక్టుల్లో పాస్ మార్కులు కూడా రాక వేలాది మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. ప్రతీ సెమిస్టర్ పరీక్షల్లోనూ అప్పటి వరకు పూర్తయిన పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయి. కొద్దిపాటిగా చదువుకున్నా ఉత్తీర్ణత సాధించే పరిస్థితి ఉంటుంది. ఎక్కువ మార్కులు రావాలంటే కొంచెం కష్టపడాల్సిందే. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకులాలు డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, 'బి' ఒకేషనల్, బీఎస్సీ హానర్స్ కోర్సుల్లో నిర్వహించిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలతోపాటు రెండో సంవత్సరం మూడో సెమిస్టర్, ఫైనల్ ఇయర్ ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కొద్దిరోజుల క్రితం అధికారులు ప్రకటించారు.ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం అంతంతమాత్రంగానే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

సెమిస్టర్ సిస్టంలోనూ మెరుగైన ఫలితాలేవి?

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ సిస్టంలో విద్యార్థులు సక్రమంగా తరగతులకు హాజరై కొంచెం కష్టపడినా ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంది. అయితే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించలేకపోవడానికి పలు కారణాలున్నాయని భావిస్తున్నారు. ఇందులో ప్రధానంగా తరగతులకు సరిగా హాజరుకాకపోవడం. వాస్తవంగా 75శాతం హాజరు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ ఏ కళాశాలలోనూ అమలు చేయడం లేదు. ప్రభుత్వ కళాశాలలే కాదు ప్రైవేట్ కళాశాలల్లోనూ నాణ్యమైన విద్యనందించడం లేదనే అంశం ఈఫలితాలను బట్టి తెలుస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువమంది పేద వర్గాలకు చెందిన వారే ఉంటారు. కొందరు కళాశాలకు అప్పుడప్పుడు వస్తూ కుటుంబ పరిస్థితులు బట్టి ప్రైవేట్‌లో ఉపాధి పొందుతున్న పరిస్థితి కూడాఉందని తెలుస్తోంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించేందుకు యాజమాన్యాలు సరిపడా బోధనా సిబ్బందిని నియమించుకోవడం లేదు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు సైన్స్ విద్యార్థులకు సరిగా ప్రాక్టికల్స్ కూడా నిర్వహించడం లేదు. మరోవైపు విద్యార్థులు ఎక్కువ సమయం సెల్‌లో ముగినిపోవడం కూడా ఉత్తీర్ణతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

అటానమస్ డిగ్రీ కాలేజీల్లో ఉత్తీర్ణత ఇలా..

అటానమస్ కాలేజీల్లో మాత్రం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. హనుమకొండ కేడీసీ (అటానమస్) డిగ్రీ మొ దటి సెమిస్టర్ పరీక్షల్లో 56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల మొదటి సెమిస్టర్‌లో 61,93 శాతం, మూడో సెమిస్టర్‌లో 73,27 శాతం, ఐదో సెమిస్టర్‌లో 82.52శాతం ఉత్తీర్ణత సాధించారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్‌లో 38,64 శాతం, 3వ సెమిస్టర్‌లో 53.33శాతం ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మొదటి సెమిస్టర్‌లో 43, 59శాతం, మూడో సె మిస్టర్‌లో 58,69శాతం, 5వ సెమిస్టర్‌లో 65.04శాతం ఉత్తీర్ణత సాధించారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 21.93 శాతమే ఉత్తీర్ణత

కేయూ పరిధిలో ఆయా డిగ్రీ కోర్సుల్లో మొత్తం 70,661 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే అందులో 15,495మంది (21.93శాతమే) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 36,504మంది పరీలకు హాజరైతే అందులో 5,278మంది (14.46శాతం)ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 34,157మందికిగాను 10,217 మంది 29.91శాతం ఉత్తీర్ణత పొందారు. ఇందులో బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది.

డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 40.73 శాతం ..

ఆయా డిగ్రీకోర్సుల్లో మొత్తం 46,828మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 19,074 మంది ఉత్తీర్ణత (40.73శాతం) సాధించారు.బాలురు 23,402 మందికిగాను 6,808మంది(29,09శాతం) ఉత్తీర్ణత, బాలికలు 23,426 మందికిగాను 12,266మంది(52.36శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురకంటే బాలికల ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంది.

డిగ్రీ మూడో సెమిస్టర్‌లో 28.97శాతం ఉత్తీర్ణత

డిగ్రీ ఆయా కోర్సుల్లో మూడో సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 59,916మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 17,356మంది ఉత్తీర్ణత (2 8.97శాతం)సాధించారు. బాలురు 29,771మందికి గాను 5,924 మంది (19.90శాతం), బాలికలు 3 0,145 మందికి గాను 11,432మంది (37.92శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలుర కంటే బాలికలే ఎక్కువశాతం ఉత్తీర్ణత పొందారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల వెల్లువ..

కేయూ పరిధిలో డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదల చేశారు. కొద్దిరోజులుగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు స్వీకరించారు. రీవాల్యుయేషన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25వ తేదీతో ముగిసింది. 1,3,5 సెమిస్టర్లు కలిపి 21,928 దరఖాస్తులు వచ్చాయి.ఒక్కో దరఖాస్తుకు రూ. 305 ఫీజు ఉంటుంది. రీవాల్యుయేషన్‌లో ఏమైనా ఫలితం లభిస్తుందనే ఉద్దేశంతో కొన్నేళ్లుగా వివిధ సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చినవారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. అడ్డ దారిలో ఏమైనా అవకాశం ఉంటుందా అని కూడా కొందరు విద్యార్థులు పరీక్షల విభాగం చుట్టు తిరుగుతుంటారు. గతంలో రీవాల్యుయేషన్ దందా వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. ఈసారి 21,928మంది దరఖాస్తుల్లో ఎంత శాతం మంది బెనిఫిట్ (ఫలితం) పొందుతారో వేచిచూడాలి.

పారదర్శకంగా విద్యుత్ సర్వీస్‌ల మంజూరు

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ఫోన్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ సర్వీస్‌ల మంజూరు సజావుగా, పారదర్శకంగా సాగుతోందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల పరిధిలోని నూతనంగా విద్యుత్ సర్వీస్‌లు పొందిన గృహ, గృహేతర, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులతో ఫోన్ ద్వారా ముఖాముఖి మాట్లాడారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం నూతన సర్వీస్‌ల మంజూరు జరుగుతున్నదా.. లేదా..? పారదర్శకంగా, నిష్పాక్షికంగా మంజూరు అవుతున్నదా.. లేదా..? అవినీతి రహితంగా సమయానుకూలంగా సర్వీస్‌ల మంజూరు జరుగుతున్నదా.. లేదా.. అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సర్వీస్‌ల మంజూరులో ఎలాంటి ఇబ్బందులు లేవని, సమయానికి సర్వీస్ విడుదల చేస్తున్నారని వినియోగదారులు తెలిపారు. నేరుగా మాట్లాడడం తమకు సంతోషంగా ఉందని తెలిపారు. సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ తాను ఇలా తరుచూ వినియోగదారులతో మాట్లాడుతానన్నారు. వినియోగదారులతో మాట్లాడడం వల్ల క్షేత్ర స్థాయిలో సమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులతో మమేకమై వారికి మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

యువతి అక్రమ రవాణా కేసులో ఐదుగురికి జైలు

● తీర్పు వెలువరించిన వరంగల్ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి

వరంగల్ లీగల్ : ఉద్యోగావకాశాల నిమిత్తం నగరానికి వచ్చిన ఓ యువతికి మాయమాటలు చెప్పి వ్యభిచార గృహానికి విక్రయించిన ఘటనలో నేరం రుజువుకావడంతో ఐదుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ వరంగల్ రెండో అదనపు జిల్లా కోర్టు (ఎస్సీ, ఎస్టీ కోర్టు) జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా వితలాపురం గ్రామానికి చెందిన ఓ దళిత యువతి టెలీకాలర్‌గా పనిచేస్తోంది. మెరుగైన ఉద్యోగం కోసం 2024, మార్చి10వ తేదీన హైదరాబాద్ ఎంజీబీఎస్‌కు చేరుకుంది. ఇక్కడ ఒంటరిగా ఉన్న యువతిని గమనించిన అక్కాచెల్లెలు తమ ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజుల ఆశ్రయం ఇచ్చారు. అనంతరం అక్కాచెల్లెల తల్లి చందన.. యువతులను విక్రయించే ముఠాతో బేరం కుదుర్చుకుని పాకనాటి శివమ్మ, పాకనాటి మమతకుకు విక్రయించింది. దీంతో శివమ్మ, మమత.. సదరు యువతిని కారులో వరంగల్ వంగపహాడ్‌లోని వ్యభిచార గృహానికి తరలించారు. ఇక్కడ నిర్వాహకురాలు కావ్యకు అప్పగించారు. సదరు యువతి వ్యభిచారం చేయడానికి నిరాకరించగా హింసించారు. దీంతో 2024న మార్చి 14న సదరు యువతి వ్యభిచార గృహం నుంచి పారిపోయి హసన్‌పర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇబ్రహీంపట్నం మండలం లక్ష్మీనిలయానికి చెందిన ముద్దంగుల చందన(అక్కాచెల్లెల తల్లి), వరంగల్ జిల్లా గీసుకొండకు చెందిన ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో ఉంటున్న పాకనాటి శివమ్మ, పాకనాటి మమత, కారు డ్రైవర్ అన్వేశ్, వంగపహాడ్ గ్రామానికి చెందిన కావ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరానికి పాల్పడిన ఐదుగురిలో చందనకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా, పాకనాటి శివమ్మకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, పాకనాటి మమతకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా, కావ్యకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా, అన్వేశ్‌కు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 4 వేల జరిమానా విధిస్తూ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ తీర్పు వెలువరించారు.

సికింద్రాబాద్ కాకుండా చర్లపల్లి మీదుగా..

● కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లు ఇతర ప్రాంతాలకు
● సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ నిర్ణయం

కాజీపేట రూరల్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను సికింద్రాబాద్ స్టేషన్‌కు రాకుండా వయా చర్లపల్లి, మౌలాలి, మల్కాజిగిరి బైపాస్‌లైన్‌లో పంపిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. కొన్ని రైళ్లను వయా కాజీపేట మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సికింద్రాబాద్ వెళ్లకుండా వెళ్లే రైళ్ల వివరాలు

ఈ నెల 26వ తేదీన తిరుపతి-ఆదిలాబాద్ (17405) కృష్ణా ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27వ తేదీన ఆదిలాబాద్-తిరుపతి (17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 25వ తేదీన సంబల్‌పూర్- నాందేడ్ (20809) ఎక్స్‌ప్రెస్, 24వ తేదీన విశాఖపట్నం-ఎల్‌టీటీ ముంబాయి (18519) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ ముంబాయి -విశాఖపట్నం (18520) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-షిర్డీ (17208) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్, 25వ తేదీన షిర్డీ-విశాఖపట్నం (18504) ఎక్స్‌ప్రెస్, నాందేడ్-సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 27న నాందేడ్-విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న నాగర్‌సోల్-నర్సాపూర్ (12788) ఎక్స్‌ప్రెస్, మే 9వ తేదీన వాస్కోడిగామా-జసిది జంక్షన్ (17321) ఎక్స్‌ప్రెస్, మే 12వ తేదీన జసిది జంక్షన్ -వాస్కోడిగామా (17322) ఎక్స్‌ప్రెస్‌లు కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్ వెళ్లకుండా చర్లపల్లి, మౌలాలి మీదుగా వయా మల్కాజిగిరి బైపాస్ లైన్ మీదుగా ప్రయాణిస్తాయని అధికారులు తెలిపారు.

మట్టి తరలింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

చెరువు పూడికతీత పనులు పరిశీలించిన కలెక్టర్లు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపును పగలు మాదిరిగానే రాత్రివేళల్లోనూ జాగ్రత్తగా తరలించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవార రాత్రి 10గంటలకు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, ఇతర శాఖల అధికారులతో కలిసి మట్టి తరలింపు ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించారు. రాత్రివేళల్లో మట్టి తరలింపు ఏర్పాట్లను సాగునీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శంకర్ చౌహాన్‌లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రావీణ్య మాట్లాడుతూ రాత్రివేళ కూడా ఎక్కువ ట్రిప్పులు వెళ్లే విధంగా చూడాలన్నారు. చెరువులో మరిన్ని అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రదేశంలో బాంబుల పేల్చివేత

● బస్సులో పడిన బండరాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు?



బస్సులో పడిన రాయి

వరంగల్: వరంగల్ బస్టాండ్ స్థానంలో ప్రభుత్వం నూతనంగా మోడల్ బస్టాండ్ నిర్మిస్తోంది. పనుల్లో భాగంగా పిల్లర్లు నిర్మించే క్రమంలో భూమిలో బండరాళ్లు ఉండడంతో తొలగించడం అనివార్యమైంది. ఈ రాళ్లను తొలిగించేందుకు కాంట్రాక్టర్ మంగళవారం జిలెటిన్ స్టిక్స్ (బాంబులు)పెట్టి పేల్చివేసినట్లు తెలిసింది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సమీపంలోని తాత్కాలిక బస్టాండ్‌లో నిలిచిఉన్న భూపాలపల్లి డిపోకు చెందిన బస్సులో పెద్ద బండరాయి పడింది. ఈ రాయి తాకడంతో బస్సు కిటికీల అద్దాలు పగిలి డ్రైవర్, కండక్టర్లకు స్వల్పగాయాలు అయినట్లు తెలుస్తోంది. ఈఘటనలో బస్సు ధ్వంసం కావడంతో కాంట్రాక్టర్ రూ.10వేలు పరిహారంగా ఇచ్చినట్లుగా స్థానికులు తెలిపారు. ఈవిషయంపై ఇంతేజార్‌గంజ్ పోలీసులను వివరణ కోరగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

నాడు నేడు నిర్లక్ష్యమే...

బస్టాండ్‌లో జరుగుతున్న ప్రతి పనిలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఏడాదిన్నర క్రితం పాత బస్టాండ్‌లోని వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసిన సమయంలో భద్రత ఏర్పాట్లు చేయకపోవడంతో ఒక కూలీ శిథిలాల కింద పడి మృత్యువాత పడ్డారు. ఇప్పుడు బండరాళ్ల తొలగింపు కోసం పేల్చివేతతో పెద్ద బండరాయి బస్సులో పడింది.



న్యాయవాదుల ధర్నా

హైదరాబాద్‌లోని చంపాపేటలో న్యాయవాది హత్య కేసు నిందితుడిని కఠినంగా శిక్షించడంతోపాటు రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. - వరంగల్ లీగల్

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

● జీఎం కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి (ఎఫ్‌పీఓ) రైతు ఉత్పత్తుల మేళా ప్రారంభం





మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, కలెక్టర్

ఖిలా వరంగల్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య సూచించారు. వరంగల్ నక్కలపల్లి రహదారిలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే రైతు ఉత్పత్తుల మేళాను మంగళవారం రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధతో కలిసి ఎమ్మెల్సీ సారయ్య.. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు మోసపోవద్దని, రైతును బలోపేతం, చైతన్య పర్చడానికే ఎఫ్‌పీఓ మేళా ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ రైతులు ఆర్థిక బలోపేతం, లాభసాటి సాగుకు ఎఫ్‌పీఓల పాత్ర కీలకమన్నారు. 40 ఉత్పత్తి దారుల సంఘాలు స్టాళ్లు ఏర్పాటు చేయగా .. ఆ ఉత్పత్తుల అమ్మకాలు చేపడుతున్నామన్నారు.

ఎఫ్‌పీఓ మేళాకు స్పందన..

ఎఫ్‌పీఓ మేళాకు స్పందన లభించింది. రాష్ట్రం నలుమూలాల నుంచి భారీగా రైతులు, నగర ప్రజలు చేరుకున్నారు. స్టాళ్లను ఆసక్తిగా తిలకించి అవసరమైన పనిముట్లు, గృహోపకరణాలు, విత్తనాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏసీ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ రామన్‌సింగ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పీజేటీఏయూ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ సుజాత, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, తహసీల్దార్లు బండి నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి, ఏడీఏ యాకయ్య, ఏఓ రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్ ఈదుల అరుణ్, రైతులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు..

● లారీ కింద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి
● రామకిష్టాపూర్(టి)లో ఘటన





పూలమ్మ (ఫైల్) సంధ్య (ఫైల్)

టేకుమట్ల: రెక్కాడితే గాని డొక్కాడని రెండు నిరుపేద కుటుంబాలను మృత్యువు వెంటాడింది. ఉదయం కూలీకి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఖాళీగా ఉంటే ఏముంటుంది..? అదనపు కూలీకి వెళ్తే పూట అయినా గడుస్తుంది కదా అనే ఆశతో సాయంత్రం కూడా వెళ్లారు. అయితే ఈ కూలే వారికి చివరిది అవుతుందని అనుకోలేదు. పాపం.. పని వెళ్లకున్నా బతికేవారేమో. మృత్యువు లారీ రూపంలో ఇద్దరు మహిళా కూలీలను కబలించింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్(టి)లో మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్షుల కథనం ప్రకారం.. రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన మోకిడి పూలమ్మ(45), మోకిడి సంధ్య(30)తోపాటు మరో ఆరుగురు కూలీలు ఉదయం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. సాయంత్రం వేళలో కూడా మళ్లీ అదే గ్రామానికి చెందిన సల్పాల బుచ్చయ్య అనే రైతు పొలంలోని పని చేయడానికి వెళ్తున్నారు. సరిగా పొలం వద్దకు చేరుకునే సమయానికి చిట్యాల మండలం శాంతినగర్ శివారు కాటన్ మిల్లు నుంచి అతివేగంగా పత్తి గింజల లోడ్‌తో మూలమలుపు వద్ద నుంచి వస్తున్న లారీని గమనించిన కూలీలు కొంత దూరం పరుగులు తీశారు. ఇందులో ముగ్గురు పొలంలోకి వెళ్లడంతో అక్కడే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పత్తి గింజల బస్తాలు పడడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తృటిలో తప్పించుకుంది. తోటి మహిళా కూలీలు భయంతో కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్సై అమరేందర్‌రెడ్డి సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని జేసీబీ సాయంతో లారీని లేపారు. మృతదేహాలను పత్తి గింజల బస్తాల కింద నుంచి బయటకు తీసి 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అప్పటి వరకు అందరి మధ్యలో ఉన్న ఇద్దరు విగత జీవులుగా మారడంతో తోటి మహిళా కూలీల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారైనట్లు మహిళా కూలీలు తెలిపారు.

పిల్లలు ఎవరిని అమ్మా అని పిలవాలి సంధ్యా..

మన పిల్లలు ఇక నుంచి ఎవరిని అమ్మా అని పిలవాలి సంధ్యా.. ఒక్కసారి చూడు సంధ్యా.. నా ప్రాణం పోయేలా ఉంది.. అయ్యో దేవుడా ఒక్కసారి బతికించమంటూ సంధ్య భర్త రాజు రోదించిన తీరు చిట్యాల సివిల్ ఆస్పత్రిలో ప్రతీ ఒక్కరిని కంట తడి పెట్టించింది. అమ్మా లే.. అమ్మా లే.. అంటూ చిన్నారుల రోదనలు మిన్నంటాయి. పూలమ్మ భర్త, కూతురు సైతం కన్నీరుమున్నీరయ్యారు.

కారును ఢీకొన్న టిప్పర్..

● వ్యక్తి దుర్మరణం
● కొత్తపల్లి శివారులో ఘటన



కరుణాకర్ మృతదేహం

ఎల్కతుర్తి: టిప్పర్.. కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ జ్యోతి నగర్‌కు చెందిన కనుకపుడి కరుణాకర్(58) చర్చ్ ఫాదర్. సోమవారం రాత్రి ఒంటి గంటకు కారులో ఎల్కతుర్తి మీదుగా హుస్నాబాద్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని చాయ్ విహార్ సమీపంలో ముల్కనూరు వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఎదురుగా కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.